ప్రకృతిని కాపాడమన్నా గణపయ్య

- చవితికి వినాయక ప్రతిమలు సిద్ధం
- పర్యావరణ హిత విగ్రహాలే మేలు
- 18 నుంచి నవరాత్రులు

రాయవరం: ఊరూవాడా వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధమైంది.. ఆ గణనాథుడిని కొలిచే పండుగ మరో రెండు రోజుల్లో అంగరంగ వైభవంగా జరుగనుంది. చవితి పందిళ్లు, సందళ్లతో గ్రామాలకు పండుగ శోభ వచ్చింది. పెద్దలతో పాటు చిన్నారులు సైతం పోటీ పడి వీధికో గణపయ్య ప్రతిమలను నిలిపి సందడి చేయనున్నారు. అయితే వేడుకల అనంతరం ప్రకృతిలో విలీనమయ్యే వినాయకుడి ప్రతిమ పర్యావరణ హితంగా ఉండేలా చూసుకోవాలని ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్రతిమలు వద్దని, ప్రతి పందిట్లోనూ మట్టి ప్రతిమలు పూజలు అందుకునేలా చూడాలని కోరుతున్నారు.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని 120 గ్రామాల్లో ఏటా వినాయక చవితి సంబరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ నెల 18న వినాయక చవితిని నిర్వహించుకోనున్న నేపథ్యంలో సమయం దగ్గర పడుతుండటంతో ఇప్పటికే పలుచోట్ల బొజ్జ గణపయ్యను కొలువు దీర్చేందుకు వేదికలు సిద్ధమవుతున్నాయి. ఏటా వందల సంఖ్యలో చవితి మండపాలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులను ఆకట్టుకునేలా వివిధ రంగులతో ప్రతిమలను కార్మికులు తీర్చిదిద్దుతున్నారు.

మట్టి ప్రతిమలే మేలు

సిద్ధి వినాయకుడిని ఎంత పవిత్రంగా పూజిస్తారో అంతే పవిత్రతతో నిమజ్జనం చేస్తారు. పర్యావరణ హితంగా తయారైన మట్టి గణపయ్యలతోనే ఇది సాధ్యమని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. చెరువు మట్టితో తయారు చేసిన ప్రతిమను తిరిగి నిమజ్జనం చేసినప్పుడు నీటిలో త్వరగా కలుస్తుంది. ఆ విగ్రహానికి అంటిన పూజా ద్రవ్యాలు, జలచరాలకు ప్రసాదమవుతాయి. ఇలా ప్రకృతి నుంచి ప్రకృతికి భక్తి ముడిపడుతుంది. కాగా భారీ ప్రతిమలనూ మట్టి, కొబ్బరి పీచును ఉపయోగించి తయారు చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

పోటా పోటీగా..

ఎంత పెద్ద విగ్రహం నిలిపితే అంత ఘనంగా వేడుక చేసినట్టనే ధోరణి ఏటేటా ఉత్సవ కమిటీల్లో పెరుగుతుంది. పల్లెల్లో కూడా ఉత్సవ పోటీ పెరుగుతోంది. పోటాపోటీగా ప్రతిమలు కొలువు దీరుతున్నాయి. 10 నుంచి 16 అడుగుల వరకూ ప్రతిమలను నెలకొల్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఒకటిన్నర ఎత్తుకు మించి ఉన్న విగ్రహం పూజకు అనువుగా ఉండదని పండితులు చెబుతున్నారు. వేడుకలు విగ్రహ ప్రదర్శనలకు వేదిక కారాదని వారు హితవు పలుకుతున్నారు.



వెదురుపాకలో మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమ

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసిన విగ్రహాలు చూడముచ్చటగా ఉన్నా నిమజ్జనం వేళలో అవి నీటిమీద తేలుతాయి. మట్టి ప్రతిమలు కలిసినంత త్వరగా పీవోపీతో చేసిన విగ్రహాలు కరగవు. పీవోపీతో చేసిన విగ్రహాలకు అద్దిన రసాయన రంగులు నీటిని కలుషితం చేయడమే కాకుండా జలచరాలకు ప్రమాదకరమని ప్రకృతి ప్రేమికులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ఆహ్లాదం నింపేందుకు..



అందించిన మొక్కలతో దాత రామకృష్ణ తదితరులు

కె.గంగవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శుక్రవారం విశ్రాంత హెచ్ఎం అవసరాల రామకృష్ణ మొక్కలు బహూకరించారు. సుమారు రూ.10 వేల విలువైన పూల, పండ్ల, అలంకరణ మొక్కలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు వీటిని బహూకరించామని అన్నారు. వాటి పరిరక్షణకు అధ్యాపకులు, విద్యార్థులు చొరవ తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ ఎ.అంజిబాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ భవాని, చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాల క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలను వారు ప్రారంభించారు. అండర్ 14, 17 బాలుర విభాగంలో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ముందుకు సాగాలన్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, నాగేశ్వరి, హెచ్ఎం టి.వీరరాఘవ రెడ్డి, ఎస్‌జీఎఫ్ జోన్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, కార్యదర్శి కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రిలే దీక్షలు



శిబిరం వద్ద మాట్లాడుతున్న దూలి జయరాజు

మండపేట: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో శుక్రవారం పలువురు పాస్టర్లు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ జరిగే సమావేశాల్లో వర్గీకరణకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిల్లి గాబ్రియేలు, కాటమరాజు, మందపల్లి రాజు, చాపల చిట్టిబాబు, ధర్మ కిరణ్, పిల్లి దైవ, చాపల రాజు, పెనుముచ్చి ప్రసాద్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అముజూరులో 'నా మట్టి- నా దేశం'



సేకరించిన మట్టిని కన్వీనర్‌కు అందిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు రమణమూర్తి

కె.గంగవరం: బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు దేశ రాజధానిలో స్మృతి వనం నిర్మాణంలో భాగంగా ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరిస్తున్నామని మండల పార్టీ అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి తెలిపారు. అముజూరులో శుక్రవారం నామట్టి- నాదేశం కార్యక్రమంలో భాగంగా సేకరించిన మట్టి కలశాన్ని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ యాండ్ర బుల్లి అబ్బులకు అందించారు. ఈ యజ్ఞంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కో కన్వీనర్ సలాది శేఖర్, నాయకులు గుర్రాల సత్యనారాయణ, వెంకటకృష్ణ, నున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు: మండలంలో నిర్వహించిన నా మట్టి- నా దేశం కార్యక్రమం శుక్రవారంతో ముగిసిందని మండల బీజేపీ అధ్యక్షుడు సలాది వీరబాబు తెలిపారు. మండలంలోని 26 గ్రామాల నుంచి సేకరించిన మట్టిని ఒక కలశంలో ఉంచి ఢిల్లీకి పంపేందుకు పార్టీ మహిళా విభాగ నేత, జగన్నాథగిరి ఎంపీటీసీ కొప్పన లక్ష్మికి అందజేశారు. నాయకులు యాండ్ర బుల్లి అబ్బులు, సలాది శేఖర్, తలాటం అమ్మాజీ పాల్గొన్నారు.

బీపీ యంత్రం అందజేత

కపిలేశ్వరపురం: వల్లూరులో ఆరోగ్య ఉప కేంద్రానికి గ్రామానికి చెందిన జూపాస్ ఫౌండేషన్ నిర్వాహకులు వీవీ ప్రసాద్, సత్య శ్యామల బీపీ యంత్రాన్ని సమకూర్చారు. వారిని ఉప కేంద్రం సిబ్బంది అభినందించారు.

తుప్పలు... తిప్పలు



ఉండూరు వంతెన దిగువలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో ఉండూరు వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా దట్టంగా తుప్పలు పెరిగిపోయాయి. వీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పొడవునా ఇరువైపులా ముళ్లపొదలు, గడ్డి మొక్కలు పెరిగాయి. వంతెన దిగువలో మలుపు ఉండడంతో పాటు దట్టంగా పెరిగిన ముళ్ల పొదల కారణంగా దగ్గరకు వచ్చే వరకూ ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. రామచంద్రపురానికి నియోజకవర్గంలోని ఇతర మండల గ్రామాల ప్రజలు వెళ్లాలంటే ఈ వంతెనపై నుంచి రావాలి. అధికారులు స్పందించి రోడ్డు ఇరువైపులా పొదలను తొలగించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు హోమియో వైద్య శిబిరం

మండపేట: ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం అర్తమూరులో 163వ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తామని ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి తెలిపారు. గ్రామంలోని ఎస్‌బీఎస్ఆర్ గ్రంథాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరిగే ఈ శిబిరంలో రాజమహేంద్రవరంలోని డాక్టర్ అల్లూ రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్య నిపుణులతో వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. అవసరమైన వారికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అర్తమూరు, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన కోరారు.

నేడు విద్యార్థులకు అవగాహన

రామచంద్రపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు తక్షణ ఉపాధి సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ వి.సోమశేఖర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలకు హెచ్‌సీఎల్ టెక్ బృందంతో పాటు జిల్లా స్థాయి అధికారులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్ బీట్ ఏర్పాటు చేయండి

మండపేట: స్థానికంగా ప్రమాదభరితంగా ఉన్న ఏడిద బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద పోలీస్ బీట్ ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు ఎస్పీ ఎస్.శ్రీధర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ కాకినాడ- రావులపాలెం బైపాస్ రోడ్డు మీదుగా రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారన్నారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద బైపాస్ రోడ్డుకు ఇరువైపులా లారీలు నిలుపుదల చేస్తున్నారన్నారు. మండపేట- ఏడిద వైపు రాకపోకలు సాగించే వారికి బైపాస్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సమస్య పరిష్కారానికి పోలీస్ బీట్ ఏర్పాటు చేయాలని ఎస్పీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు కామన తెలిపారు.

రాష్ట్ర చదరంగం పోటీలకు ఎంపిక



అభిరామ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

కపిలేశ్వరపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి ఇళ్ల లీలా అభిరామ్ రాష్ట్ర స్థాయి అండర్- 14 చదరంగం పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కాకినాడ డీఎస్సీ మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అభిరామ్ ప్రతిభ కనబర్చాడు. త్వరలో జరిగే రాష్ట్ర చదరంగం పోటీల్లో ఆడేందుకు అర్హత పొందిన విద్యార్థిని హెచ్ఎం వంగా శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు గుబ్బల వేణుగోపాలరావు, వాసంశెట్టి రవికుమార్ అభినందించారు.

గ్రామాభివృద్ధికి తోడ్పాటు అభినందనీయం



కళావేదిక ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పురుషోత్తమరావు తదితరులు

మండపేట: ఏడిద గ్రామాభివృద్ధికి పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తమరావు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పురుషోత్తమరావు ఆర్థిక సౌజన్యంతో ఆ గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో రూ.18 లక్షలతో నిర్మించిన కళావేదిక, కచేరి చావిడి వద్ద ఆయన తల్లిదండ్రులు నామాల వీర్రాజు, సీతారత్నం పేరిట రూ. 50 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాలను శుక్రవారం వారితో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ప్రారంభించారు. దీనికి అధ్యక్షత వహించిన సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పురుషోత్తమరావు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. రూ.1.8 కోట్లతో పాఠశాల భవనాన్ని నిర్మించడంతో పాటు 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి రూ. రెండు లక్షల ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్నారన్నారు. ఈ ఏడాది నుంచి ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.ఐదు లక్షల బహుమతి ప్రకటించారని తెలిపారు. జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ స్వగ్రామానికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. పురుషోత్తమరావు సహకారాన్ని గ్రామ ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పురుషోత్తమరావు మాట్లాడుతూ గ్రంథాలయ భవనంలోని ఒక అంతస్తులో త్వరలో కంటి ఆస్పత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షల నిమిత్తం రూ.50 లక్షల విలువైన అధునాతన యంత్ర సామగ్రిని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పెద్ద చెరువును వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం పురుషోత్తమరావును ఎమ్మెల్సీ తోట, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ, కుడిపూడి రాంబాబు, వాసిరెడ్డి అర్జున్, తాతపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ద్వారపూడి రోడ్డు పనులు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: మండపేట- ద్వారపూడి రోడ్డు అభివృద్ధి పనులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రైస్‌మిల్లు వద్ద నుంచి ఆర్‌అండ్‌బీ అధికారులు సీసీ రోడ్డు పనులు పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే గ్రామంలోని తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన వరకూ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా శుక్రవారం వంతెనకు ఇవతలి వైపు నుంచి తాపేశ్వరం గ్రామం వైపు పనులు మొదలు పెట్టారు. ఈ పనులను ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. పూర్తి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ పలు సాంకేతిక అవరోధాలతో రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోగా ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రత్యేక చొరవ తీసుకుని అమరావతిలో ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. త్వరలోనే ద్వారపూడి రోడ్డు సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు. ఇప్పనపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుశూల శ్రీనివాసరావు, పార్టీ నేత కొప్పిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



వి.సావరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాయవరం: ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. శుక్రవారం వి.సావరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించి, అవసరమైన వారికి వైద్య సహాయాన్ని వైద్య శిబిరాల ద్వారా అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా దృష్టి లోపాలను సరిచేయడం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారి దేవిరాజశ్రీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల ఆరోగ్య వివరాలను సేకరించారు. ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, సర్పంచ్ కాకి కృష్ణవేణి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, నాయకులు కాకి కోటేశ్వరరావు, నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేశ మండపాలకు అనుమతి తప్పనిసరి

రాయవరం: ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రుల నేపథ్యంలో వినాయక మండప కమిటీలు ముందస్తు అనుమతి తీసుకోవాలని రాయవరం ఎస్సై జి.నరేష్ సూచించారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయక మండపాల ఏర్పాటుకు ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి, పోలీస్ స్టేషన్లలో తెలిపి వారి గుర్తింపు కార్డు నకలు చూపించి అనుమతి పొందాల్సి ఉందన్నారు. బలవంతపు చందాలు వసూలు చేయరాదన్నారు. అలాంటి చర్యలకు పాల్పడితే ప్రజలు 100కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. విగ్రహం పరిమాణం, బరువు, ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు, నిమజ్జనం చేసే తేదీ, సమయం పోలీసులకు ముందుగానే తెలియజేయాలన్నారు. దీపారాధన సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లౌడ్ స్పీకర్లు ఉపయోగించాలన్నారు. మండపం ఉండే ప్రదేశం వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని, ఊరేగింపు సమయంలో అశ్లీల నృత్యాలు చేసినా, బాణసంచా సామగ్రిని ఉపయోగించడం నిషిద్ధమన్నారు. నిమజ్జనానికి వెళ్లే వాహనంపై మద్యం లేదా మత్తు పదార్థాలను తాగిన వారు, మైనర్లు ఉంటే చర్యలు తప్పవన్నారు. పూజలు, వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



కపిలేశ్వరపురంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలికల కబడ్డీ అండర్-17 విభాగంలో కపిలేశ్వరపురం విద్యార్థులు గెలుపొందగా వల్లూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. బాలుర విభాగంలో వల్లూరు విన్నర్, అంగర రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ అండర్-17 బాలికల విభాగంలో వల్లూరు, అంగర జట్లు, బాలుర విభాగంలో నల్లూరు, కపిలేశ్వరపురం జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఖోఖో బాలికల్లో కపిలేశ్వరపురం, అంగర, బాలుర విభాగంలో కపిలేశ్వరపురం, నల్లూరు జట్లు మొదటి, రెండో స్థానాలు దక్కించుకున్నాయి. కబడ్డీ అండర్- 14 బాలికల విభాగంలో కపిలేశ్వరపురం, వల్లూరు, బాలుర విభాగంలో కపిలేశ్వరపురం, టేకి, వాలీబాల్ బాలికల విభాగంలో వల్లూరు, అంగర, బాలుర విభాగంలో కపిలేశ్వరపురం, వల్లూరు, ఖోఖో బాలికల విభాగంలో కపిలేశ్వరపురం, అంగర, బాలుర విభాగంలో కపిలేశ్వరపురం, నల్లూరు జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఆయా పోటీలను వ్యాయామోపాధ్యాయులు గుబ్బల వేణుగోపాలరావు, వాసంశెట్టి రవికుమార్, మేకా సత్యనారాయణ, ముత్తా సత్యనారాయణ, కె.దుర్గాప్రసాద్, ఉన్నిసాబేగం నిర్వహించారు. ఎంఈఓ కె.తాతారావు, హెచ్ఎం వంగా శ్రీనివాస్ పర్యవేక్షించారు.

టీడీపీ పల్లకి మోసేందుకు సిద్ధంగా లేం..

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లీలాకృష్ణ



వల్లూరులో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లీలాకృష్ణ

కపిలేశ్వరపురం: టీడీపీతో తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించిన పొత్తును తామంతా స్వాగతిస్తున్నామని, అయితే టీడీపీ నాయకుల పల్లకి మోసేందుకు తాము సిద్ధంగా లేమని మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. వల్లూరులోని తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనను అంతమొందించడానికి, ప్రజా శ్రేయస్సు మేరకు తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇటీవల టీడీపీ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి తామేదో ఎమ్మెల్యేలైపోయినట్టు, ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. తాము చాలాకాలంగా జనసేన పార్టీలో ఉంటూ ప్రజా సేవ చేస్తున్నామన్నారు. ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వెళితేనే పొత్తు సఫలమవుతుందని, లేదంటే మిమ్మల్ని పల్లకి మోయడానికి తాము సిద్ధంగా లేమని టీడీపీ నాయకులకు హితవు పలికారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ జనసేన నాయకులపై కేసులు పెట్టారని, జన సైనికులు అనేక కష్టాలను అనుభవించారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వైఖరిని విమర్శించారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని డీపీఓ ఆర్.విక్టర్ అన్నారు. జి.మామిడాడలో స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా సచివాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో చెత్త తొలగింపు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ హీ సేవా కార్యక్రమం ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతుందన్నారు. ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి, సచివాలయ కార్యదర్శి యశ్వంత్, డీపీఆర్‌సీ కుమార్‌రాజా పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం



మండపేటలో విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మండపేట: స్థానిక సంఘం కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇంజినీర్స్ డేను శుక్రవారం నిర్వహించారు. భారత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ మాట్లాడుతూ ఇంజినీర్స్ డే ఆవశ్యకతను వివరించారు. సృజనాత్మకమైన వృత్తి నైపుణ్యాలతో పరిమితమైన వనరులతో దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించిన ఘనత భారతరత్న విశ్వేశ్వరయ్యకు దక్కుతుందన్నారు. ఆయన జయంతి రోజున ప్రభుత్వం ఇంజినీర్స్ డే నిర్వహిస్తుందన్నారు.


రామచంద్రపురం రూరల్: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని అంబికపల్లి అగ్రహారంలోని రాజారత్న కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. రామచంద్రపురం మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బర్ల వెంకట్, డైరెక్టర్ పవన్‌కుమార్, ఏఓ రవిధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఈ నిర్ణయం.. ఎంతో స్వచ్ఛం

- మండపేటలో డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం
- ఎమ్మెల్సీ తోట చొరవతో స్థల సేకరణ పూర్తి

మండపేట: చిత్తశుద్ధి ఉండాలే కాని ఎంతటి మొండి సమస్యనైనా పరిష్కరించవచ్చని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిరూపించారు. మండపేట ప్రజలను దశాబ్దాలుగా పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం కలిగించారు. గత పాలకులకు సాధ్యం కాని స్థల సేకరణను సుసాధ్యం చేసి చూపించారు. మండపేట మున్సిపాలిటీకి కేవలం 2.5 ఎకరాల విస్తీర్ణం కలిగిన డంపింగ్ యార్డు మాత్రమే ఉంది. పట్టణంలో రోజు సుమారు 30 టన్నుల చెత్త వస్తుండగా మొత్తం ఇక్కడికే తరలిస్తున్నారు. తరచూ డంపింగ్ యార్డు నిండిపోయి కొద్దిపాటి వర్షానికి చెత్త తరలింపు సాధ్యంకాక పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కష్టతరమవుతోంది. ఒక్కో ట్రక్కును నాలుగైదు ఇంజిన్లతో పైకి తీసుకు వెళ్లాల్సి వస్తోంది. చెత్త తరలింపునకు వీలులేక గత టీడీపీ కౌన్సిల్ హయాంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే వాటర్ వర్క్స్ ఆవరణతో పాటు పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోవడం విమర్శలకు దారితీసింది. ట్రాక్టర్లను డంపింగ్ యార్డులోకి తీసుకు వెళ్లేందుకు తరచూ జేసీబీతో బాటలు వేసేందుకు లక్షలాది మున్సిపల్ నిధులు వెచ్చిస్తున్నారు. రెండో డంపింగ్ యార్డు కోసం 15 ఏళ్ల కిందట పట్టణంలో పలుచోట్ల అధికారులు స్థల పరిశీలన చేశారు. ప్రస్తుత డంపింగ్ యార్డును అనుకుని ఉన్న 2.75 ఎకరాలు సేకరించేందుకు పదేళ్ల కిందటే రెవెన్యూ శాఖకు రూ.1.2 కోట్లు మున్సిపాలిటీ చెల్లించింది. కాగా స్థల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. పట్టణంలో స్థల సేకరణ సాధ్యం కాదని ద్వారపూడిలో స్థల సేకరణ ప్రయత్నించగా ఆ గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు.

దశాబ్దాలుగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు పెను సవాల్‌గా ఉన్న డంపింగ్‌యార్డు సమస్యపై ఎమ్మెల్సీ తోట దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి స్థల సేకరణకు అదనంగా నిధుల మంజూరుకు కృషి చేశారు. రెండు నెలల కిందట రెవెన్యూ శాఖకు మున్సిపాలిటీ రూ. 2.14 కోట్లు చెల్లించింది. స్థల యజమానులతో మాట్లాడి వారితో కోర్టు కేసులు విత్ డ్రా చేయించడం ద్వారా స్థల సేకరణకు మార్గం సుగమం చేశారు. శనివారం ఆ స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోనుంది.



డంపింగ్ యార్డు వద్ద ఒక ట్రక్కును మూడు ట్రాక్టర్ ఇంజిన్లతో లాగుతున్న దృశ్యం(ఫైల్)

నేడు స్థలం స్వాధీనం



డంపింగ్ యార్డు స్థల సేకరణకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. శనివారం లాంఛనంగా మున్సిపాలిటీ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటుంది. మరో రెండు దశాబ్దాల పాటు పట్టణానికి డంపింగ్ యార్డు సమస్య ఉండదు. దీనివల్ల మెరుగైన పారిశుధ్య నిర్వహణకు వీలుంటుంది.

–టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మండపేట